27న బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ రోడ్‌షో

నాగర్‌కర్నూల్, ఏప్రిల్ 21: గులాబీ దళపతి కల్వకుంట్ల చంద్రశేఖర్‌రావు ఈ నెల 27వ తేదీన నాగర్‌కర్నూల్‌కు రానున్నట్లు మాజీ ఎమ్మెల్యే మర్రి జనార్దన్‌రెడ్డి ఆదివారం ప్రకటనలో తెలిపారు. పార్లమెంట్ ఎన్నికల ప్రచారంలో భాగంగా నాగర్‌కర్నూల్ పట్టణంలో 27వ తేదీ సాయంత్రం 6 గంటలకు నిర్వహించనున్న రోడ్‌షోలో కేసీఆర్ పాల్గొంటారన్నారు. ఉయ్యలవాడ నుంచి ప్రారంభమయ్యే రోడ్‌షోకి ప్రజలు, రైతులు, పార్టీ ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పెద్ద ఎత్తున హాజరై విజయవంతం చేయాలని కోరారు.

రాహుల్‌గాంధీని ప్రధాని చేయాలి

- ఎమ్మెల్యే వంశీకృష్ణ

మల్లురవిని సన్మానిస్తున్న ఎమ్మెల్యే వంశీకృష్ణ

అచ్చంపేట/బల్మూరు, ఏప్రిల్ 21: రాహుల్ గాంధీని ప్రధానిని చేయడమే లక్ష్యంగా నాగర్‌కర్నూల్ పార్లమెంట్ కాంగ్రెస్ అభ్యర్థి మల్లురవిని అధిక మెజార్టీతో గెలిపించాలని ఎమ్మెల్యే డాక్టర్ వంశీకృష్ణ అన్నారు. ఆదివారం అచ్చంపేటలోని ఓ ఫంక్షన్‌హాల్‌లో యూత్ కాంగ్రెస్ ఆధ్వర్యంలో యువ సమ్మేళనం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి పార్టీ పార్లమెంట్ అభ్యర్థి మల్లు రవితో కలిసి ఎమ్మెల్యే పాల్గొని మాట్లాడుతూ యూత్ కాంగ్రెస్ కార్యకర్తలు గడప గడపకు వెళ్లి కాంగ్రెస్ ప్రభుత్వ పథకాలు ప్రజలకు వివరించాలన్నారు. అసెంబ్లీ ఎన్నికల కంటే రెట్టింపు ఉత్సాహంతో పనిచేసి పార్లమెంట్ అభ్యర్థి మల్లురవిని అత్యధిక మెజార్టీతో గెలిపించాలని దిశానిర్దేశం చేశారు. అభ్యర్థి మల్లురవి మాట్లాడుతూ అచ్చంపేట నియోజకవర్గం నుంచి అధిక మెజార్టీ అందించి తనను గెలిపించాలన్నారు. అలాగే బల్మూరు మండలకేంద్రం లో ఎన్నికల ప్రచారంలో భాగంగా కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి మల్లురవి, ఎమ్మెల్యే వంశీకృష్ణ ఆదివారం ప్రచారం చేశారు. కార్యక్రమంలో యూత్ కాంగ్రెస్ రాష్ట్ర, జిల్లా, నాయకులు వెంకట్‌రెడ్డి, గిరి, ఖదీర్, కాశన్నయాదవ్, సునీల్‌రెడ్డి, రమేశ్‌రెడ్డి, విష్ణు, శైలేశ్ ఉన్నారు.

భక్తిశ్రద్ధలతో రథోత్సవం

- వేలాదిగా తరలివచ్చిన భక్తజనం

రథాన్ని లాగుతున్న భక్తులు

చారకొండ, ఏప్రిల్ 21: సిరుసనగండ్ల సీతారామచంద్ర స్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఆదివారం తెల్లవారుజామున రథోత్సవం అత్యంత రమణీయంగా జరిగింది. ఈ వేడుకను తిలకించేందుకు వివిధ ప్రాంతాల నుంచి వేలాదిగా భక్తులు తరలివచ్చారు. రథోత్సవం వద్ద కళాకారులు కోలాటాలు, నాటకాలు ప్రదర్శించారు. అంతకుముందు ఎమ్మెల్యే డాక్టర్ వంశీకృష్ణ పాల్గొని రథోత్సవాన్ని ప్రారంభించారు. భక్తులు సీతారామచంద్ర స్వాములను దర్శనం చేసుకొని తీర్థప్రసాదాలను స్వీకరించారు. బ్రహ్మోత్సవాల్లో ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా సీఐ విష్ణువర్ధన్‌రెడ్డి, ఎస్సై రాజశేఖర్ ఆధ్వర్యంలో భారీ పోలీసు బందోబస్తు ఏర్పాటు చేశారు.

అమ్రాబాద్, పెద్దకొత్తపల్లిలో..

అమ్రాబాద్/పెద్దకొత్తపల్లి, ఏప్రిల్ 21: మండలంలోని మద్దిమడుగు పబ్బతి ఆంజనేయస్వామి జయంత్యుత్సవాలు ఆదివారం వైభవంగా ప్రారంభమయ్యాయి. మూడురోజులపాటు కొనసాగే ఉత్సవాల్లో మొదటిరోజు యాగశాల ప్రవేశం, గణపతి పూజ, అంకురార్పణ, ధ్వజారోహణ, స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా భక్తులు అధిక సంఖ్యలో స్వామి వారిని దర్శించుకున్నారు. రాత్రి 8గంటలకు అశ్వవాహన సేవ, పార్వతీ పరమేశ్వరుల కల్యాణోత్సవం నిర్వహించారు. అలాగే పెద్దకొత్తపల్లి మండలం నాయినోనిపల్లి మైసమ్మ అమ్మవారిని ఆదివారం జిల్లా నలుమూలల నుంచి భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చి దర్శించుకున్నారు. ఈ సందర్భంగా అమ్మవారికి ప్రత్యేక పూజలు చేసి మొక్కులు తీర్చుకున్నారు. కార్యక్రమంలో ఆలయ ఈవో రంగాచారి, జూనియర్ అసిస్టెంట్ జైపాల్, అర్చకులు వీరయ్యశాస్త్రి, త్రిపాఠి, రఘు, సిబ్బంది పాల్గొన్నారు.

రేపు సామూహిక వ్రతాలు

నాగర్‌కర్నూల్‌టౌన్, ఏప్రిల్ 21 : జిల్లా కేంద్రంలోని రాంనగర్ కాలనీ సీతారామచంద్ర స్వామి ఆలయంలో చైత్ర పౌర్ణమిని పురస్కరించుకొని మంగళవారం ఉదయం 11గంటలకు సామూహిక సత్యనారాయణ స్వామి వ్రతాలు నిర్వహిస్తున్నట్లు ఆలయ ప్రధాన అర్చకులు కందాడై వరదరాజన్ అయ్యంగార్ ఆదివారం ప్రకటనలో తెలిపారు. ఈ కార్యక్రమంలో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొనాలని కోరారు.

జెండాలు తొలగించిన వారిపై చర్యలు తీసుకోవాలి

నిరసన తెలుపుతున్న కేవీపీఎస్ నాయకులు

నాగర్‌కర్నూల్, ఏప్రిల్ 21: బిజినేపల్లి మండలం ఖానాపూర్‌లో అంబేద్కర్ విగ్రహం వద్ద నీలి జెండాలను తొలగించిన వారిపై కేసు నమోదు చేయాలని కేవీపీఎస్ జిల్లా అధ్యక్షుడు అంతటి కాశన్న డిమాండ్ చేశారు. అంబేద్కర్ జయంతి సందర్భంగా ఏర్పాటు చేసిన జెండాలను తొలగించడంపై ఆదివారం జిల్లా కేంద్రంలోని అంబేద్కర్ విగ్రహం ఎదుట కేవీపీఎస్ ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఖానాపూర్‌లో మత తత్వవాదులు తోరణాలు తొలగించారని, వారిపై కేసు నమోదు చేసి చట్టపరంగా కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

కార్యక్రమంలో వెంకటయ్య, రాంబాబు, కృష్ణ, చంద్రయ్య, రాములు తదితరులు పాల్గొన్నారు.

బీజేపీ నాయకుల ఇంటింటి ప్రచారం

పెద్దకొత్తపల్లి, ఏప్రిల్ 21: బీజేపీ యువ మోర్చా కార్యవర్గ సభ్యుడు చంద్రశేఖర్ ఆధ్వర్యంలో ఆదివారం మండల కేంద్రంలో ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ రైతులు, అన్ని వర్గాల అభివృద్ధి కోసం కృషి చేస్తున్నారన్నారు. నరేంద్ర మోదీని మరోసారి ప్రధానిని చేసేందుకు నాగర్‌కర్నూల్ పార్లమెంట్ బీజేపీ అభ్యర్థి భరత్‌ను భారీ మెజార్టీతో గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

నమస్తే తెలంగాణ క్లాసిఫైడ్స్

WANTED
★హైదరాబాద్‌లో ఆర్థికంగా స్థిరపడడానికి అద్భుత అవకాశం కష్టపడి పనిచేసే వారికి మంచి సంపాదన, ఫ్రీ వసతి + భోజనం కలదు. ఫోన్: 8121748850
NT-340525

WANTED
★హరేకృష్ణ హోంకేర్ హైదరాబాద్ నందు వృద్ధులను, పేషంట్స్‌ను చూసుకొనుటకు వర్కర్స్, నర్సులు కావలెను. ఉచిత వసతి భోజనం. జీతం: 16K to 18K ఏజెంట్ కమీషన్. 6K. Ph: 9640258899, 9640468899.
NT-311831-All

ప్రకటన
క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించు కోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో నమస్తే తెలంగాణ పత్రికకు ఏ విధమైన సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

To Book your Classified
4 lines Advt
Rs. 200/-
Only (B/W)
Additional Line
50/- Only
For Advertisement Enquiry
Please Contact...
9182777641
9182777654
9182777794

నీరు పారేదెలా..?

- అధ్వానంగా కేఎల్ఐ ప్రధాన కాలువ
- కంపచెట్లు, జమ్ము తొలగించాలని రైతు సంఘం నాయకుల డిమాండ్

కల్వకుర్తి మండలం తిమ్మరాశిపల్లి వద్ద కేఎల్ఐలో పేరుకుపోయిన జమ్ము, కంపచెట్లు

కల్వకుర్తి, ఏప్రిల్ 21: కాల్వల్లో కంపచెట్లు, పూడిక పేరుకుపోతే పంటలకు సాగునీరు ఎలా అందుతుందని కేఎల్ఐ ఆయకట్టు రైతులు ప్రశ్నిస్తున్నారు. కల్వకుర్తి ఎత్తిపోతల పథకంలో భాగమైన 29వ ప్యాకేజీ ప్రధాన కాలువలో కంపచెట్లు, జమ్ము పెరగడంతో పాటు పూడిక పేరకు పోయిందని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. గుడిపల్లి గట్టు నుంచి కల్వకుర్తి మండలం జంగారెడ్డిపల్లి వరకు దాదాపు 160 కిలోమీటర్ల వరకు 29వ ప్యాకేజీ కాలువ ఉంది. ఆ కాలువలో చాలా చోట్ల జమ్ము, కంప చెట్లు మొలిచి సాగునీటి సరఫరాకు ఇబ్బందిగా మారిందని వారంటున్నారు. ప్రస్తుతం కాల్వకు నీటి సరఫరా లేనందున అధికారులు యుద్ధ ప్రాతిపదికన కాల్వలో పేరుకుపోయిన పూడిక, కంపచెట్లు, జమ్మును తొలగించాలని రైతులు కేఎల్ఐ అధికారులకు విజ్ఞప్తి చేస్తున్నారు. కేఎల్ఐ ప్రధాన కాలువలో కంపచెట్లు, పూడిక తొలగించకపోతే పంటలకు సాగునీరు అందడం కష్టమని, నీళ్లు ముందుకు పారక కాల్వలు ఎక్కడ పడితే అక్కడ తెగిపోయే ప్రమాదం ఉందని వారు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వం స్పందించి కాల్వలో పేరుకుపోయిన బురద, జమ్ము, కంపచెట్లను తొలగించాలని రైతు సంఘ నాయకులు కోరుతున్నారు.

సింగారం గ్రామంలో సీసీ రోడ్డుపై నిలిచిన వర్షం నీరు

అచ్చంపేట మండలంలో చిరుజల్లులు

అచ్చంపేటరూరల్/బల్మూరు, ఏప్రిల్ 21: మండలంలోని సిద్దాపూర్, బొమ్మనపల్లి, ఐనోల్, సింగారం, పెద్దతండా, ఎడ్డుమిట్టతండా, కాన్యతండా, కిష్టతండా, బాల్యతండా తదితర గ్రామాల్లో ఆదివారం సాయంత్రం చిరుజల్లులతో కూడిన వర్షం కురిసింది. దీంతో ఉదయం నుంచి ఎండవేడిమి, ఉక్కపోతతో ఇబ్బందులు పడ్డ జనం కొంత ఉపశమనం పొందారు. అదేవిధంగా బల్మూరు మండలంలోని ఆయా గ్రామల్లో ఆదివారం సాయంత్రం వర్షం కురిసింది.

నేటి నుంచి సమ్మర్ క్రికెట్ క్యాంప్

కల్వకుర్తిరూరల్, ఏప్రిల్ 21 : కల్వకుర్తి పట్టణంలోని స్టేడియం గ్రౌండ్స్‌లో కల్వకుర్తి క్రికెట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో సోమవారం సమ్మర్ క్రికెట్ క్యాంప్ ప్రారంభిస్తున్నట్లు నిర్వాహకుడు సుధాకర్ ఆదివారం ప్రకటనలో తెలిపాడు. సోమవారం ఉదయం 8 గంటలకు క్యాంప్ ప్రారంభించనున్నారని ఆసక్తి గల క్రీడాకారులు సమ్మర్ క్యాంప్‌ను సద్వినియోగం చేసుకోవాలని నిర్వాహకులు కోరారు.

అఖండ మెజార్టీతో గెలిపించుకుందాం

- బీఆర్ఎస్ నాయకుల ఇంటింటి ప్రచారం


ఉప్పునుంతలలో ప్రచారం చేస్తున్న బీఆర్ఎస్ నాయకులు

వెల్దండ, ఏప్రిల్ 21: నాగర్‌కర్నూల్ పార్లమెంట్ బీఆర్ఎస్ అభ్యర్థి ఆర్ఎస్‌ప్రవీణ్‌కుమార్‌ను అఖండ మెజార్టీతో గెలిపించుకుందామని బీఆర్ఎస్ మండల నాయకుడు ఈడుదులపల్లి శ్రీనివాస్ అన్నారు. ఆదివారం వెల్దండ మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ జూట హామీలకు తెలంగాణ ప్రజలు మోసపోయారని, పార్లమెంట్ ఎన్నికల్లో అది పునరావృతం కాదన్నారు. ప్రజలంతా బీఆర్ఎస్ వైపే ఉన్నారన్నారు. పేదల బాగోగులు తెలిసిన ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్‌ను గెలిపిస్తే ఈ ప్రాంతం అన్ని విధాలా అభివృద్ధి చెందుతుందన్నారు. ఈ సమావేశంలో బీఆర్ఎస్ నాయకులు పాల్గొన్నారు.

ఉప్పునుంతలలో..

అచ్చంపేట, ఏప్రిల్ 21: ప్రజలను మోసం చేస్తున్న కాంగ్రెస్, బీజేపీ పార్టీలను పార్లమెంట్ ఎన్నికల్లో చిత్తుగా ఓడించాలని బీఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకుడు అచ్చంపేట పాలశీతలీకరణ కేంద్రం చైర్మన్ గోపాల్‌రెడ్డి, ఎల్లయ్యయాదవ్ అన్నారు. ఆదివారం వారు స్థానిక నాయకులతో కలిసి బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థి ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్‌కు మద్దతుగా ఉప్పునుంతల మండల కేంద్రంలో ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రజలను మోసం చేస్తున్న పార్టీలకు గట్టి బుద్ధి చెప్పాలని, బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థి ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్‌ను భారీ మెజార్టీతో గెలిపించాలన్నారు. ఆరు గ్యారెంటీల అమలు పేరుతో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ పార్టీ ఒక్క హామీ కూడా నిలబెట్టుకోలేదన్నారు. కాంగ్రెస్ నైజం ప్రజలకు అర్థమైందని పార్లమెంట్ ఎన్నికల్లో ఆపార్టీకి తగిన బుద్ధి చెబుతారన్నారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు చిన్నజంగయ్య, బాలస్వామి, సుధాకర్, వెంకటేశ్, శ్రీను, తదితరులు పాల్గొన్నారు.

అచ్చంపేట : కరపత్రాలు విడుదల చేస్తున్న చైర్మన్, నాయకులు

అచ్చంపేటలో..

అచ్చంపేట, ఏప్రిల్ 21: నాగర్‌కర్నూల్ పార్లమెంట్ బీఆర్ఎస్ అభ్యర్థి ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్‌ను భారీ మెజార్టీతో గెలిపించాలని అచ్చంపేట మున్సిపల్ చైర్మన్ నర్సింహాగౌడ్ అన్నారు. ఆదివారం ఆయన అచ్చంపేట పట్టణంలో బీఆర్ఎస్ ఎన్నికల ప్రచార కరపత్రాలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ అసెంబ్లీ ఎన్నికల్లో బూటకపు హామీలతో అధికారం చేపట్టిన కాంగ్రెస్ ఆరు గ్యారెంటీలను గాలికొదిలేసి మళ్లీ పార్లమెంట్ ఎన్నికల్లో గెలుపొందేందుకు మాయమాటలు చెబుతోందన్నారు. కాంగ్రెస్ అధికారం చేపట్టిన ఐదు నెలల్లోనే తెలంగాణ ఆగమైందని మళ్లీ ప్రజలు కేసీఆర్ ప్రభుత్వాన్ని కోరుకుంటున్నారన్నారు. పార్లమెంట్ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ ప్రజలను మోసం చేసేందుకు యత్నిస్తోందని ప్రజలు ఈ సారి ఆలోచించి బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థి ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్‌కు ఓటు వేసి గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో కౌన్సిలర్ రమేశ్‌రావు, సింగిల్‌విండో డైరెక్టర్ శంకర్‌మాదిగ, సురేశ్, ఆర్ఎస్పీ టీం సభ్యులు నిర్మల పాల్గొన్నారు.

'కందికొండ' ఆశయ సాధనకు కృషి

- తెలంగాణ సాహితీ సంస్థ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆనందాచారి

రచయిత్రి స్ఫూర్తి కందివనానికి అవార్డు అందజేస్తున్న సభ్యులు

నాగర్‌కర్నూల్, ఏప్రిల్ 21: తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట యోధుడు కందికొండ రామస్వామి ఆశయ సాధనకోసం కృషి చేయాలని తెలంగాణ సాహితీ సంస్థ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కే. ఆనందాచారి అన్నారు. ఆదివారం నాగర్‌కర్నూల్ జిల్లా కేంద్రంలోని సింగిల్ విండో సమావేశ హాల్‌లో నెలపొడుపు సాహిత్య సాంస్కృతిక వేదిక ఆధ్వర్యంలో వనపట్ల సుబ్బయ్య అధ్యక్షతన కందికొండ రామస్వామి స్మారక జాతీయ పురస్కారం అవార్డు సభ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఆనందచారి ముఖ్య అతిథిగా హాజరై కందికొండ రామస్వామి స్మారక పురస్కారానికి ఎంపికైన డిమ్కి కథల రచయిత్రి స్ఫూర్తి కందివనానికి అవార్డు అందజేసి సత్కరించారు. అంతకుముందు రామస్వామి చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పేదల అభ్యున్నతికి జీవితాంతం కృషిచేసిన గొప్ప మహనీయుడు కమ్యూనిస్టు రామస్వామి అని అన్నారు. అవార్డు గ్రహీత రచయిత్రి స్ఫూర్తి కందివనం రచించిన డిమ్కి కథలు సంచార కులాలైన బుడగజంగాల జీవితాలను కళ్లకు కట్టినట్లు ఉన్నాయని కొనియాడారు. విశిష్ట అతిథి సీపీఐ రాష్ట్ర సమితి సభ్యుడు హెచ్.ఆనంద్‌జీ మాట్లాడుతూ కందికొండ రామస్వామి అభ్యుదయ విలువలు, చిత్తశుద్ధితో సమసమాజ సాధన కోసం జీవితాంతం కృషి చేశాడని ఆయన జీవితం అందరికీ ఆదర్శనీయమన్నారు. మాజీ ఎంపీ మల్లు రవి మాట్లాడుతూ రామస్వామి స్ఫూర్తితో మరిన్ని రచనలతో ముందుకెళ్లాలని అవార్డు గ్రహీతను అభినందించారు. డిమ్కి కథల పుస్తకాన్ని అసిస్టెంట్ ప్రొఫెసర్ పెబ్బేటి మల్లికార్జున్ సమీక్షించారు. కార్యక్రమంలో సీపీఎం జిల్లా కార్యదర్శి వర్ధం పర్వతాలు, సీఐటీయూ జిల్లా కార్యదర్శి ఆర్.శ్రీనివాసులు, ఐద్వా అధ్యక్షురాలు కందికొండ గీత, ఉపాధ్యాయుడు అబ్దుల్లా ఖాన్, కవి ఎదిరెపల్లి కాశన్న, డి.రాములు, కల్వకోల్ మద్దిలేటి, గౌస్ పాషా, ముచ్చర్ల దినకర్, బోనాసి తిరుపతయ్య, పాల్గొన్నారు.

గేట్‌వాల్వ్ గుంతలో పడి వాటర్‌మెన్ మృతి

రామచంద్రయ్య మృతదేహం

బిజినపల్లి, ఏప్రిల్ 21: ప్రమాదవశాత్తు గేట్‌వాల్వ్ గుంతలో పడి వాటర్‌మెన్ మృతి చెందిన ఘటన మండల కేంద్రంలో ఆదివారం చోటుచేసుకున్నది. పోలీసుల కథనం మేరకు బిజినేపల్లికి చెందిన రామచంద్రయ్య(56) బిజినేపల్లి గ్రామపంచాయతీలో వాటర్ మెన్‌గా విధులు నిర్వహిస్తున్నాడు. రోజువారిగా నీటి సరఫరా చేసేందుకు రామచంద్రయ్య ఆదివారం తెల్లవారుజాము న గ్రామంలోని ఒకటో వార్డులోని వాటర్ ట్యాంక్ వద్ద గేట్ వాల్వ్ తిప్పేందుకు వెళ్లాడు. ప్రమాదవశాత్తు కాలు జారిపడి గేట్‌వాల్వ్ గుంతలో పడడంతో తలకు తీవ్ర గాయమయ్యింది. చుట్టుపక్కల వారు గమనించి గుంతలోనుంచి తీసే సరికే మృతి చెందినట్లు తెలిపారు. ఘటనపై మృతుడి భార్య పోచమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై నాగశేకర్ రెడ్డి తెలిపారు.

అట్టహాసంగా బండలాగుడు పోటీలు

బండను లాగుతున్న వృషభరాజులు

లింగాల, ఏప్రిల్ 21: మండల కేంద్రంలోని కోదండ రామస్వామి బ్రహ్మోత్సవాలను పురస్కరించుకొని ఆదివారం నిర్వహించిన అంతరాష్ట్ర స్థాయి ఎద్దుల బండలాగుడు పోటీలు అట్టహాసంగా కొనసాగాయి. పోటీల్లో తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాలకు చెందిన 17జతల ఎద్దులు పాల్గొన్నట్లు నిర్వాహకుడు, సింగిల్ విండో మాజీ చైర్మన్ కొండల్‌రావు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులను చైతన్యపర్చడానికే బండలాగుడు పోటీలు నిర్వహించినట్లు తెలిపారు. పోటీల్లో నంద్యాలకు చెందిన భూమా గోవర్ధన్‌రెడ్డి ఎద్దులు ప్రథమ స్థానం, గద్వాలకు చెందిన జానకిరాముడు ఎద్దులు ద్వితీయ స్థానం, తృతీయ స్థానంలో కర్నూల్ జిల్లాకు చెందిన సురేశ్ ఎద్దులు, నాల్గో స్థానంలో నారాయణపేట జిల్లాకు చెందిన రశీద్‌బాషా, వనపర్తికి చెందిన గోసాయి నరేశ్ నాయుడు ఎద్దులు, ఐదో స్థానంలోలింగాల మండలం ధారారం గ్రామానికి చెందిన చింటి ఎద్దులు నిలిచినట్లు తెలిపారు. విజేతలకు దాతల సహకారంతో నగదు బహుమతులు అందజేసినట్లు తెలిపారు.

కార్యక్రమంలో ఆలయ కమిటీ అధ్యక్షుడు పూజారి భాస్కర్, గిరిజన ఉపాధ్యాయుల సంఘం తాలూకా అధ్యక్షుడు శంకర్‌రాథోడ్, బీసీ ఐక్యవేదిక మండలాధ్యక్షుడు రాజలు, సభ్యులు బారీ, బాలరాజుగౌడ్, కిషన్‌నాయక్, యాదయ్య, ఆంజనేయులు, తరుణ్, వెంకటయ్య తదితరులు పాల్గొన్నారు.

బీజేపీకి ఓట్లడిగే అర్హత లేదు

- గిరిజనాభివృద్ధి సంస్థ చైర్మన్ బెల్లయ్య నాయక్

సమావేశంలో మాట్లాడుతున్న బెల్లయ్య నాయక్

నాగర్‌కర్నూల్, ఏప్రిల్ 21: కేంద్రంలో పదేండ్లు అధికారంలో ఉన్న బీజేపీ గిరిజనులు, ఆదివాసీలకు ఒరగబెట్టిందేమీ లేదని గిరిజనాభివృద్ధి సంస్థ చైర్మన్, ఆదివాసి గిరిజన సంఘం రాష్ట్ర అధ్యక్షుడు నెనావత్ బెల్లయ్యనాయక్, నాగర్‌కర్నూల్ పార్లమెంట్ అభ్యర్థి మల్లురవి అన్నారు. ఆదివారం నాగర్‌కర్నూల్ జిల్లా కేంద్రంలోని ఎమ్మెల్సీ కూచుకుల్ల దామోదర్ రెడ్డి ఇంటి వద్ద నిర్వహించిన ఆదివాసి గిరిజనుల సమావేశంలో వారు పాల్గొని మాట్లాడారు. ఇందిరా గాంధీ గిరిజనులు, ఆదివాసీల అభివృద్ధికి ఎంతో కృషి చేసిందన్నారు. ప్రస్తుతం రాష్ట్రంలో అధికారం ఉన్న కాంగ్రెస్ పార్టీకి కేంద్రంలోనూ అధికారం కట్టపెట్టేలా కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి మల్లు రవిని గెలిపించుకోవాల్సిన బాధ్యత గిరిజనులపై ఉందన్నారు. సమావేశంలో గిరిజన సంఘం నాయకులు రఘునాయక్, వాల్యానాయక్, మాజీ జెడ్పీటీసీ కొల్లాపూర్ హన్మంతు నాయక్, వనపర్తి ఎంపీపీ శంకర్ నాయక్, సేవాలాల్ సేన అధ్యక్షుడు గోపాల్ నాయక్, మాజీ సర్పంచులు గోవింద్ నాయక్, బద్యా నాయక్, మాజీ ఎంపీటీసీ మన్యానాయక్ పాల్గొన్నారు.

సూర్య ప్రచండం..

- నిప్పులు కక్కుతున్న భానుడు..
- 43 డిగ్రీలు దాటుతున్న ఉష్ణోగ్రత
- ఎండ తాకిడికి బెంబేలెత్తుతున్న జనం

ఎండ తాకిడితో నిర్మానుష్యంగా మారిన వెల్దండ జాతీయ రహదారి

వెల్దండ, ఏప్రిల్ 21 : భానుడి భగభగతో జనం ఉక్కిరిబిక్కిరి అవుతున్నారు. సూర్యుడు నిప్పులు కురిపిస్తుండడంతో ప్రజలు బెంబేలెత్తిపోతున్నారు. పగలు ఎక్కువ, రాత్రి తక్కువ సమయం ఉండే వేసవిలో కొద్దిపాటి జాగ్రత్తలు పాటిస్తే చల్లదనాన్ని ఆస్వాదించొచ్చు.

పాటించాల్సిన చిట్కాలు..

- ◆ ఆహార పదార్థాల్లో నూనె తక్కువగా వాడాలి
- ◆ ఆకుకూరలు ఎక్కువగా తీసుకోవాలి.
- ◆ ఉదయం పూట నూనె వంటలు కాకుండా ఆవిరి వంటలు తినాలి.
- ◆ కర్బూజాలు ఎక్కువగా తీసుకోవాలి..
- ◆ మజ్జిగ అన్నం తింటే మరీ మంచిది.
- ◆ కూల్‌డ్రింక్స్ కన్నా కొబ్బరి నీళ్లు తాగాలి.
- ◆ కాఫీ, టీలకు దూరంగా ఉండాలి.
- ◆ కిటికీలు, గుమ్మాలకు వట్టి వేళ్ల తెరలను తడిపి కట్టుకుంటే చల్లదనాన్నిస్తాయి.
- ◆ పిల్లలు ఎండలోకి వెళ్లకుండా ఇండోర్ గేమ్స్ ఆడించాలి.
- ◆ పలుచని మజ్జిగలో కాస్తంత నిమ్మరసం, ఉప్పు కలిపి పిల్లలు, పెద్దలు తాగితే మంచింది.
- ◆ బయటి జ్యూస్‌లు ఎక్కువగా తీసుకోకుండా ఇంట్లో అన్ని రకాల పండ్లు, కూరగాయలతో జ్యూస్‌లు చేసుకుని తాగాలి.
- ◆ తాటిముంజలు ఆరోగ్యానికి ఎంతో మేలు చేస్తాయి.
- ◆ నీరు ఎక్కువగా ఉండే ఆహార పదార్థాలను, నీటిని ఎక్కువగా తీసుకోవాలి.
- ◆ బయటకు వెళ్లినప్పుడు కళ్లకు సన్ గ్లాస్, టోపీ ధరించాలి.
- ◆ ఆరోగ్య సమస్యలున్న వారు బయటికి రాకపోవడం మంచిది.
- ◆ వదులుగా ఉండే కాటన్ దుస్తులు ధరించాలి.
- ◆ ఆల్కహాల్, సిగరెట్, కార్బోనేటెడ్ వంటి ద్రావణాలకు దూరంగా ఉండాలి.
- ◆ బయటకు వెళ్లినప్పుడు వాటర్ బాటిల్ వెంట తీసుకెళ్లాలి.

పురుగుల మందుతాగి

ఏఈవో ఆత్మహత్య

కల్వకుర్తి రూరల్, ఏప్రిల్ 21: పురుగుల మందు తాగి ఏఈవో ఆత్మహత్యకు పాల్పడ ఘటన కల్వకుర్తి పట్టణంలో చోటు చేసుకున్నది. స్థానికుల కథనం మేరకు చారకొండ మండలం గోకారం ఏఈవోగా విధులు నిర్వహిస్తున్న రామాంజనేయులు(28) కల్వకుర్తి పట్టణంలోని విద్యానగర్‌లో భార్య, కుమారుడితో కలిసి నివాసం ఉంటున్నాడు. ఆదివారం సాయంత్రం పట్టణ శివారులో పురుగుల మందు తాగి అపస్మారక స్థితికి చేరుకోవడంతో గమనించిన స్థానికులు కల్వకుర్తి ప్రభుత్వ దవాఖానకు తరలించారు. పరిస్థితి విషమంగా ఉండడంతో మెరుగైన చికిత్స కోసం హైదరాబాద్‌కు తరలిస్తుండగా మృతి చెందినట్లు తెలిపారు. ఈ ఘటనపై ఎలాంటి ఫిర్యాదు అందలేదని ఎస్సై మాధవరెడ్డి తెలిపారు.